# అన్నపాకకు ఆ చివర ఈ చివర

ఒక్క పూటే కానివ్వండి, చుట్టూ గిరి గీచి నట్లున్న నాలుగంగల లోగిలి లోపలే కానివ్వండి, పంచ భూతాలలో అణువణువునా విస్తరించి దాగుడుమూత లాడటమే తప్ప బాహ్య నేత్రాలకు కనిపించడని చెప్పబడే భగవంతుడు మానవుల మధ్య మహితతేజంతో అవతరించిన చందాన సోషలిజం నిజరూపంతో సాక్షాత్కరించి సహస్ర రవితేజంతో ప్రకాశించడం చూసిన వాళ్ళు సువిశాల భారతదేశంలో ఎవరైనా వున్నారా? లేరని చెప్పటానికి వీల్లేదు. ఆ దర్శన భాగ్యానికి నోచుకున్న వాళ్ళు - సొరకాయల పేట పౌరులున్నారు.

అంతకుముందు కొన్ని రోజుల నుంచీ 'ఉద్యమం' పేరుతో ఆందోళన తీవ్రంగా సాగుతోంది. విద్యార్థులు రంగంలోకి దిగారు. రాజకీయపక్షాలు వాళ్ళను రంగంలోకి దించాయనటం మరింత బాగుంటుంది. మానవరక్తం తాగమరిగిన పెద్ద పులి మానవ కల్యాణానికి తోరణం కట్టడానికి ముందుకొచ్చినట్లుగా, డబ్బూ పలుకుబడీ కలిగిన స్థానిక పెద్దలు ఇటువంటి హంగామాలకు పెళ్ళి పెద్దలై కూర్చోవడం పరిపాటి. ఉద్యోగులు సైతం ఉద్యమంలోకి దింపబడ్డారు. దీనికి తోడు మహిళా లోకం కూడా లేచింది. నాజూకుతనంలో రోజా రేకులతో పోటీపడే రాజీవలోచనలు దొర్లిపోతున్న గుండ్రాతిని ఆపినంత సునాయాసంగా కొండంత రైళ్ళను గోరంత దూరమైనా కదలనివ్వారు కారు. ఊరూరా బందులూ, బహిరంగ సభలూ, చందా వసూళ్ళూ, వీధులను ఒరుసుకునే ఊరేగింపులూ, నింగిని తూట్లు పొడిచే నినాదాలూ, దిష్టి బొమ్మల దహనాలూ, గాడిదల మెరవణి వేడుకలూ నిత్యకృత్యమైపోయి, ఈ తంతు ఉదయాస్తమాన సర్వసేవా పథకంగా పరిణమించింది. ఊరూరా కార్యాచరణ సంఘాలూ, రిలే నిరాహార దీక్షా శిబిరాలూ కొత్త దేవాలయాల్లా వెలిశాయి. ప్రతి రోజూ వార్తా పత్రికల నిండా, విస్తరిస్తున్న ఉద్యమాన్ని గురించిన వార్తలూ ఫోటోలే!

ఈ ఉద్యమం ఎందుకన్నది మనకు అప్రస్తుతం. బుద్ధి జీవుల దృష్టిలో, ఏ ఉద్యమానికైనా పరమావధి సామ్యవాద స్థాపన! కాకపోతే, కనీసం ఆగమ్యం వైపు మరో ముందడుగు! మసి బూసి మారేడు కాయ జేసినట్లు, స్వార్థ పరుల స్వప్రయోజనాలే రాజకీయ కారణాలుగా ముద్ర వేసుకుని ఉద్యమాలకు బీజాలైనప్పుడు ఆ కారణాల వూసు మనకెందుకు? మోక్షం కోసం ముక్కు మూసుకు కూర్చున్నవాడు వాత్స్యాయన కామసూత్రాల్ని చెవిన వేసుకోవటం కంటే, చెవులు మూసుకోవటమే నయం!

ఈ ఉద్యమ కార్యక్రమాలన్నిట్లోకీ రిలే నిరాహారదీక్ష హైలైట్! దానికి సాటివచ్చే పోలికలు కొన్ని వున్నాయి. మాస్ పిక్చర్‌లో జయమాలిని నృత్యం అలాంటిదే! పెళ్లి వేడుకలలో శోభనం ముచ్చటకూడా అలాంటిదే!

సారకాయలపేట బజారు వీధిలో రద్దీగా వుండే ఓ శృంగాటకంలో ఓ యింటి ముందువైపు గదిలో ఉద్యమ కార్యాలయమూ, దాని ముంగిట్లోనే రోడ్డుమీదికి కుమ్ముకొచ్చినట్లుగా రిలే నిరాహారదీక్షా శిబిరం అంటూ ఓ పందిరీ ఏర్పాటు చెయ్యబడ్డాయి. వార్తాపత్రిక తిరగేస్తూ పిచ్చాపాటీ మాట్లాడుకుంటూ, రాత్రయినా సరే పగలయినాసరే ఇష్టమొచ్చినంతసేపు కూర్చుని కాలక్షేపం చెయ్యటానికి ఆ పందిరి అనువైన చోటుగా అమరింది. కొన్ని సంక్రమణాల పాటైనా, ఆకాశంలో రోజూ అవే చుక్కలు కనిపిస్తాయి. ఈ నిరాహార దీక్షా శిబిరంలో మాత్రం నిన్న కనిపించిన ముక్కులు ఈ రోజు కనిపించవు. రోడ్లవెంట వెళ్తున్న జనం ఆ పరిసరాలను సమీపించగానే, జూ లోకి ప్రవేశించినప్పటి చిత్త ప్రవృత్తికి లోనైపోయి, శిబిరానికి సూటిగా రోడ్డుకు అవతలివైపున పాడుగాటి గుంజలపైన నిలబెట్టిన సినిమా పోస్టర్లలోని అందాలను పారవశ్యంతో తిలకించి, తలతిప్పి, పేగులుతీసి మెళ్ళో వేసుకున్న నృసింహస్వాముల్లా పూలసరాలతో పందిట్లో కూర్చునివున్న నిరాహార దీక్షాపరుల కంటి చూపుల్లో మూగబోతున్న ఆకలి కేకల్ని చూచి, చాటుగా నవ్వుకోటానికి తల మళ్లీ అటు తిప్పుకుంటుంటారు.

బండెడు కూటితో, బలిసిన దున్నల్తో, రోజుకొక్కరు చొప్పున బకాసురుడికి ఆహారంగా వెళ్ళాలని వంతులుపెట్టి వుంటే, సారకాయలపేట వాస్తవ్యులంతా ఎప్పుడో వూరొదిలిపెట్టి వెళ్ళిపోయి వుండేవారు. అలాంటి ప్రాణభయం ఈ అఖండ యజ్ఞంలో లేదు గనుక, రోజుకు ఒక్కరేం కర్మ, అథమపక్షం ఆరుగురైనా వొచ్చి ఆహారంలో నుంచి వెలివేయబడ్డ షడ్రుచుల్లా ఆ శిబిరంలో కొలువుదీరుతున్నారు. మాట వరుసకు ఎల్లయ్యకు పుల్లయ్యతో ఏదో అవసరమొచ్చిందనుకుందాం. ఎల్లయ్య పుల్లయ్య యింటికి వెళ్తాడు. 'ఆయన

ఇంట్లో లేరండీ!' అంటుంది పుల్లయ్య పెళ్ళాం. 'ఎక్కడికెళ్ళాడు' అని అడగొచ్చుకదా ఎల్లయ్య? 'నిరాహార దీక్షలో వున్నాడా, మరెక్కడికైనా వెళ్ళాడా?' అని మాత్రమే అడుగుతాడు.

వంశానికి మూల పురుషుడితో బాటుగా గ్రూప్ ఫోటో కోసం సర్దుకు కూర్చున్న ఉమ్మడి కుటుంబంలా ఒక్కసారిగా ఇరవైమంది కూర్చున్న సందర్భాలు కూడా లేకపోలేదు.

అన్నపూర్ణకు ఆవాసమైన కాశీనగరంలో వ్యాసుల వారికి భిక్ష లభించని విధంగా, సారకాయలపేటలో నిరాహారదీక్షకు ఒక రోజున మనుషుల కరువొచ్చిపడింది. గంగానది ఇంకిపోయింది. కామధేనువు గొడ్డుపోయింది. కల్పతరువు మోడుబారింది. వడ్డనలేని విస్తరిలా శిబిరం బోసిపోతుందేమోనని కార్యకర్తలు భయపడ్డారు.

కారణం- ఆ రోజు పండుగ! ఏ శివరాత్రి జాగారమో ఏకాదశి ఉపవాసమో అయితే, రొట్టె విరిగి నేతిలో పడిందనుకోవచ్చు. అలాంటిలాంటి పండుగకాదే యిది! వండి తినటమన్నదే మానవాభ్యుదయానికి పరాకాష్ఠగా భావించి, ఆత్మను పరమాత్మగా పూజించి, ముప్పొద్దులా భుక్తాయాసంతో ఆపసోపాలు పడే పండుగ అది!

ఆ రోజు అంచె ఆగిపోతుందేమో ననుకుంటున్న కార్యకర్తలకు అంతు తోచని ఎడారిలో ఆంధ్రాహోటల్ ప్రత్యక్షమైనంత హఠాత్తుగా అభయహస్తం లభించింది. ఉద్యమానికి విఘ్నం కలగకుండా ఆదుకోవటానికి పండుగ భోజనాలను సైతం పరిత్యజించారు ఇద్దరు విశిష్ట పురుషులు. ఒకరు గ్రామపంచాయతీ సర్పంచ్ సర్వాయితువ్వన్న. ఆరెండో వాడెవడు?

ఆనాటి ఉదయం సర్వాయి తువ్వన్న దేశం కోసం నిప్పుల్లో దూకడానికొచ్చిన వాడిలా చిరునవ్వుతో శిబిరంలో కాలుపెట్టగానే, ఏవేవి వర్ధిల్లాలో ఏవేవి నశించాలో చెబుతున్న అట్టముక్కల నడుమ రాజభోగం అబ్బిన వాడిలా మెడలో పూలహారం ధరించి పాడుగాటి బెంచీపైన ఆసీనుడై కనిపించినవాడు – మాతయ్య! పంచాయతీలో పాకీపనిచేసే దియ్యాల మాతయ్య!

పంచాయతీ ప్రెసిడెంటు పట్టాన్ని ఏదో ఒకింత అలంకార ప్రాయంగా మాత్రమే కొత్తచెప్పుల్లా కాలికి తొడుక్కున్న స్థితిమంతుడూ, సారకాయలపేట ప్రథమ పౌరుడూ అయిన సర్వాయి తువ్వన్న ఎదుట రెండు బారల దూరంలో నిలబడటానికే వెరగుపడే మాతయ్య ఈరేడులోకాల సర్వం సహా సార్వభౌమాధికారిని

చూచిన కింకరుడిలా చివుక్కున లేచి నిలబడ్డాడు, "దండాల్సామీ!" అంటూ.

"ఇక్కడున్నావేందిరా నువ్వు?" అన్నాడు తువ్వన్న, రాకుమార్తె పక్కన పెళ్ళిపీటల మీద వాడు కనబడిపోయినట్లుగా కళ్ళు తిప్పుతూ.

"సత్యాగ్రహానికొస్తిన్సామీ!" అంటూ చేతులు పిసుక్కున్నాడు మాతయ్య.

"పండగ గదరా?" కదిలీ కదలని చేతి వేళ్ళతో కూర్చోమన్నట్లుగా సైగజేశాడు తువ్వన్న.

ఎప్పుడెప్పుడు ఇంటికెళ్ళిపోయి వేడి వేడి ఇడ్లీలో, దోసెలో, పూరీలో ఉడికీ ఉడకని మాంసం పులుసులో అద్దుకు తిందామా అన్న ఆత్రుతతో ఆవురావురు మంటున్న యువ కార్యకర్తలు కుర్రవాడికి బుర్ర గొరిగినట్లుగా తువ్వన్నను పట్టి అదే బెంచీపైన ప్రతిష్ఠించి, ఇక్కడెత్తిన కాలు ఇంట్లో మోపేటట్లుగా అడుగుసాచారు.

వాసుకి తలాతోకా పట్టుకుని పాలకడలిని చిలుకుతూ మధ్యలో కాసేపు అలసట తీర్చుకోటానికి కూర్చున్న దేవదానవులలా ఒకే బెంచీపైన ఆ చివర సర్వాయి తువ్వన్న, ఈ చివర దియ్యాల మాతయ్య! దినపత్రికలోకి చూస్తూ తువ్వన్న, చూపరుల దృష్టిని ఎదుర్కోనటానికి సిగ్గుపడుతూ అవతల సినిమా పోస్టర్లలోకి చూస్తూ మాతయ్య. ఇద్దరూ ఒకే వేషం కట్టి ఒకే రంగంమీద కనిపించే అంకం ఒకటి ఈ వీధి నాటకంలో వుంటుందని ముందుగా వాళ్ళు ఊహించలేదు. పొద్దు పైకెక్కుతున్న కొద్దీ బెంచీకి ఆ చివరవున్న కించ, ఈ చివరవున్న బెరుకూ ఆవిరైపోయి, వేషానికి వన్నెతెచ్చే మూడ్స్ మాత్రమే ఎండకు ఆరిన గుడ్డల్లా యిద్దరిలోనూ మిగిలాయి.

కూటికీ గుడ్డకూ లోటులేని కలవారి కుర్రవాళ్ళూ, ఆడంగులు వొండిన వంటకాలను రుచి చూస్తూ లొట్టలు వెయ్యటం తప్ప ఇంట్లో మరో పనీపాటా లేనివాళ్ళూ ఆ రోజు పగటి నిద్ర వగలుపోతూ వొచ్చి వాటేసుకునేదాకా శిబిరం దగ్గరే కాలక్షేపం చేశారు. తిన్నది అరగటానికి, ఉన్న ఉపాయం యిదేనన్నట్లుగా అట్టముక్క లెత్తుకుని నినాదాలు చేస్తూ బజారు వీధి పొడుగునా రెండు సార్లు నగర సంకీర్తన గావించారు.

బంధుమిత్రులందరూ భుక్తాయాసంతో నడిచొచ్చి, సత్యాగ్రహం చేస్తున్న తువ్వన్నను పరామర్శించి వెళ్ళారు. కన్నుమూసి తెరిచే సరికే కేలెండర్లు మారిపోతున్నాయనే ఆశ్చర్యంలోనే, అరవై పేజీల నవలను తిరగేసేసినట్లుగా అరవై ఏళ్ళదూరం నడిచొచ్చేసిన తువ్వన్నకు ఆ ఒక్క రోజూ మరో అరవై ఏళ్ళుగా గడిచింది. ఆ పందిరి పాకశాలకాదు. అక్కడ భాండ సమృద్ధిగానీ, వండిన

ఆనవాళ్ళుగానీ లేవు. అయినా పెళ్ళివారింట్లో పొయ్యిదగ్గర కూర్చున్నట్లుగా వేడి వేడిగా కమ్మని వాసనలు గుమాయించేశాయి. తువ్వన్న నాలుక నుంచి పుట్టిన ఇంద్రజాలం అది!

భోజనాలయిందంట్రా సుబ్బయ్యా? పొట్ట బొట్ట మాదిరిగా ఉందే! వంటలు మాత్రం బాగ జేస్తుందిరా నీ పెండ్లాం. ఏమేం జేసిందీ పొద్దు?

ఏందయ్యో ఎల్లప్ప శెట్టీ? పాత కాలాల రైలింజను మాదిరిగా బొంయ్యిమంటా, అవేం తేపులు? తునకలు ఒక ముక్క తక్కువగా తినుండరాదూ? ఓర్నా మతిమండ, మీరు కోమట్లుగదూ? తునకలేం తినుంటావులే? వడా పాయసమేనా, వెజిటబుల్ బిరియానీ కూడానా?

బాపనోళ్ళిండ్లల్లో తినాలయ్యా పులిహోరా, నేతిపొంగలీ! భలే వుంటుంది!

వాడు లేడూ, ఆ మీసాల మల్లిరెడ్డి? ఈ దినం పొట్టేలు గోసినాడంట. తొడకూర రెండు కేజీలు తెచ్చిచ్చినాడు. నా కిష్టమని విత్తనాలూ, వులవకాయలూ గూడా తెచ్చినాడు. మా పిలకాయలు తినేసుంటార్లే! ఈ మధ్యానం స్వీట్లూ అప్పచ్చులూ ఏందేందో జెయ్యాలంటా వుండిరి మా ఆడోళ్ళు, ఏం జేసుకున్నారో ఏమో?

పరిచితులనందర్నీ నిలేసి తువ్వన్న మనసారా మాట్లాడుకున్న ముచ్చట్లివన్నీ!

వూరంతా విందులు గుడుస్తుంటే, తువ్వన్నా, మాతయ్యా ఇద్దరూ పొద్దు గుంకేలోగా చెరో గ్లాసులో నాలుగైదుసార్లు గ్లూకోజ్ నీళ్ళు మాత్రమే తాగారు.

కడుపు చెరువంతై పోవాలని ఏమునిపుంగవుడైనా శపిస్తే, దిగులు పడవలసిన అవసరం తువ్వన్నకులేదు. ఏడు తరాలు కూర్చుని తిన్నా తరగనంత ఆస్తి అతనికుంది. అయితే అతడి అంతస్తుకూ ఐశ్వర్యానికీ లొంగని ఏదో అజ్ఞాత శక్తి ఏది పడితే అది తినరాదని అతడికి ఆంక్షలు విధించింది. తువ్వన్నకు డబ్బుంది. జబ్బుల్ని లాలించటానికి కూడా ఆ డబ్బు పనికొస్తుంది.

ఏనుగుల్లాంటి జబ్బులు కొన్ని అతడి ఆశ్రయంలో స్థిరనివాసం ఏర్పరచు కొన్నాయి. ఆ కారణంగా కొన్ని రకాల ఆహార పదార్థాలు అతడికి నిషిద్ధం. అలాగని, మనసుకు ఇష్టమూ జిహ్వకు రుచి కరమూ అయిన పదార్థం కంటబడినప్పుడు మనసునూ, జిహ్వనూ కసిరి మొట్టికాయ వేయలేడతను. అది మోహిని రూపంలో వచ్చిన మృత్యువని తెలిసినా, దానిని కౌగిలించుకోకుండా మాత్రం వుండలేడు. అందుకే, సన్యాసం స్వీకరించి సంసార వ్యామోహాలకు దూరంగా మారుమూల గుహల్లో మరుగు వెతుక్కున్నట్లుగా, పండగపూట మాట

వినక మారాం చేసే పసిపిల్లల్లాంటి ఇంద్రియాలను తీసుకొచ్చి నిరాహార దీక్షా శిబిరంలో ఉయ్యాలలో పడవేయటం క్షేమం అనుకున్నాడు.

మరి, దియ్యాల మాతయ్య ఎందుకు ఉపవాసానికొచ్చినట్టు?

తువ్వన్న జబ్బులకంటే పెద్ద జబ్బే వుందతనికి. తినటానికేమీ లేకపోవటమన్నదే ఆ జబ్బు. తువ్వన్నకూ మాతయ్యకూ మధ్య వున్న అంతరం ఎంతో చెప్పటం కష్టమేమీ కాదు. సృష్టి కాలంలో బ్రహ్మ విష్ణువులకు కానవచ్చినట్లు పురాణాలలో వర్ణింపబడిన జ్యోతిర్లింగం పొడవెంతో, ఈ అంతరం కూడా అంతే! ఆనాడు తువ్వన్నకూ మాతయ్యకూ ఒకే పీట వేసింది కూడా ఈ అంతరమే!

పాకీపని చెయ్యటం కూడా పొట్టనింపుకోటానికే! పాకీపని చేసినాకూడా పొట్ట నిండకపోతే పుణ్యభూమిని ఏమని కీర్తించాలి? జుగుప్సాకరమైన వృత్తిలో కెలికి వెన్నముద్ద తీసినట్లు చేతికొచ్చే చిన్న జీతంతో కల్లోగంజో తాగి కడుపు నిమురుకోవచ్చు, కట్టుకొయ్యలు పాతుకుని మనుషుల్ని మచ్చికచేసి ముకుదాళ్ళు పొడిచేవాళ్ళు లేకపోతే!

తువ్వన్న దేవేరి పేరు అన్నపూర్ణమ్మ. పక్కన తాను లేకుండా పతిదేవుడు పూజలందుకోవటం యిష్టంలేని అన్నపూర్ణమ్మ మహిళల వార్డులో పోటీచేసి తానుకూడా పంచాయతీ మెంబరయింది. పాకీవాళ్ళను కన్నబిడ్డల్లా చేరదీసింది. "చెడిపోకండ్రా చవటల్లారా! నా దగ్గిర చీటీలు కట్టండి" అంది. "మీరు కష్టాల్లో వుంటే, కంటితో ఎట్ల జూసేదిరా? డబ్బుగావాలంటే యిస్తా, తీసుకోండి. తక్కువ వడ్డీనే ఇయ్యండి. ఫరవాలేదు" అంది. గిరాకీ పెరగగానే, ఆ క్షణంలోనే చెట్టు మొలిచి మరుక్షణంలోనే కాయలు గాసినంత తొందరగా మూడు అసళ్ళు ఆరు వడ్డీలుగా రేటును పెంచేసింది. పాకీవాళ్ళు ఒకటో తారీఖునే జీతాలందుకుంటారు గానీ, ఏ ఒకరిద్దరో తప్ప తక్కినవాళ్ళు ఇంటికి వెళ్ళేది వుత్త చేతులతోనే! వాళ్ళంతా అన్నపూర్ణమ్మగారింటి పాడియావులైపోయారు మరి!

తాళికట్టిన మరుక్షణమే పెళ్ళాన్ని పరాయివాడి పరంజేసినట్లు, ఆ నెలజీతం కూడా ఇలా అందుకుని అలా ఆమె చేతిలో పోసేశాడు మాతయ్య. "అమ్మా! ఇంట్లో నూకల్లేవు. నూరో ఇన్నూరో ఇయ్యకపోతే నేనింటికిపోలేను" అన్నాడు, దోపిడీ దొంగ దగ్గిర మొత్తుకున్నట్లు!

"నేనిప్పుడు బంగారు కొనుక్కోవాల్రా! డాలర్ చైనో అని మొత్తుకుంటావుంది మా పాప. ఇంకొక పది దినాలదాకా పది రూపాయలు గూడా అడగొద్దు!" అంటూ, తన స్థూల కాయంలోని కండలు కరిగిపోయినట్లుగా గసపోస్తూ కొంగు

లాక్కుని గొంతుకింది చెమట తుడుచుకుందామె.

గానుగలో పెట్టిన చెరకుగడలా యిక ఈ పది రోజులూ భరించరాని కాలచక్రంలో నలిగి బయటపడటం ఎలా? పది రోజులు మాత్రం చచ్చిపడుండటానికి ప్రత్యేకమైన ఉరితాళ్ళు లేవు కదా?

పెళ్ళాం పిల్లలగోడు కంటితో చూడటం కంటే పండుగపూట యింట్లో వుండి చేసేదేముంది? ఎక్కడున్నా పస్తు తప్పదు. ఆ నిరాహార శిక్షకు నిరాహార దీక్ష అన్న కితాబైనా దక్కుతుంది కదా, శిబిరంలో కూర్చుంటే?

మాతయ్యకు గర్వంగా వుంది. ఎందుకంటే, తాను ఉద్యమంలో పాల్గొన్నాడు. తువ్వన్నకూ తనకూ సమానస్థితిని కల్పించిన ఉద్యమం అది.

ఆనందం అతడి ఆకలిని జోకొట్టింది.

తువ్వన్నకు అన్నీ వుండొచ్చు, మాతయ్యకు ఏమీ లేకపోవచ్చు-అంతరాలకు యిప్పుడిక్కడ తావులేదు. పస్తు అన్నా, దీక్ష అన్నా, అది యిద్దరికీ సమానంగానే వర్తిస్తుంది. ఉద్యమం దేనికోసమైతేనేం, ఒకే కాడికి కట్టిన జోడెడ్లలా భారంలో యిద్దరూ పాలుపంచుకున్నారు. కలిమీ-లేమీ, హెచ్చు - తగ్గూ, అధికారం - దాస్యం, అభిజాత్యం - న్యూనత మొదలైన పరస్పర విరుద్ధాంశాలన్నీ వాటి సహజ స్వరూపాలను కోల్పోయి సమానత్వాన్ని సంతరించుకుని ఒకే సమతలంపైన కూర్చుని సహజీవనం చేశాయి. భారతదేశపు భూతలమైనా మోసగాడి చేతిలోని తులాదండంలా ఒక వైపుకి వాలివున్నది కానీ, ఆ ఇద్దరూ కూర్చున్న బెంచీ మాత్రం సమంగా, సమతా భారతి ఎక్కి కూర్చున్న సింహ పీఠికలా ఉంది. ఈ పీఠం సాగరతీరాల దాకా విస్తరిస్తే ఎంత బాగుంటుందో! చావైనా బ్రతుకైనా, సుఖదుఃఖాలను చిరునవ్వుతో పంక్తి భోజనంలా పంచుకోవచ్చు!

అలాంటి రోజులొస్తాయా?

మాతయ్య కళ్ళనిండా - మాలిన్యం లేని కలలు మల్లెలు నడిచొచ్చినంత సందడిగా ముసురుకున్నాయి. ఆ కలల్లో - నవ్వులతో పువ్వులైన పసిపాపల పెదవుల్లా, రేపటి ఆశలు విచ్చుకున్నాయి. బంగారపు తొడుగులతో బ్రహ్మోత్సవం జరుపుకునే కఠిన పాషాణ శిలలా కాకుండా ఒంటిమీద గుడ్డ వుందో లేదో చూసుకోకుండా, పురుడు పోసిన వాళ్ళు పక్కనే వున్నారని సిగ్గు పడకుండా, పేగు తెగి నేలా ఒళ్ళూ నెత్తుటిలో దొప్పదోగుతూ వుండటాన్ని పట్టించుకోకుండా, అప్పుడే కడుపు చించుకుని కాళ్ళసందున పడిన పసికందు వైపు ఆత్రంతో తొంగి చూసే పచ్చి బాలెంతరాలిలా అందంగా, స్వచ్ఛంగా, నిర్మలంగా,

నిష్కపటంగా, సమ్మోహన కరంగా, సంతోషప్రదాయకంగా, ముఖంమీదా కడుపు మీదా పురిటి వాసనల పొలిండ్లు ఒత్తుకుంటున్నట్లు అనిర్వచనీయంగా కనిపిస్తున్నది రేపు!

కంటినిండా కలలతోనే ఆ రేయి తెల్లవారింది. బెంచీపైన ఆ చివరా ఈ చివరా కూర్చున్న ఆ ఇద్దరూ వారి వారి స్థానాలను చేరుకున్నారు - శాపం తీరినవాడిలా ఒకడూ, పుణ్యం ఖర్చయి పోయినవాడిలా మరొకడూ!

నాలుగు బారల పొద్దెక్కిన వేళ - పెళ్లాం జాగ్రత్తగా తయారు చేసి పని పిల్లచేత పైకి పంపించిన ఉపాహారాన్ని తింటూ మేడ మీద గదిలో కూర్చున్నాడు తువ్వన్న. ఆహారం గొంతులో నుంచి గుటుకు గుటుకున దిగిపోతుంటే, మాతయ్య ఏం చేస్తున్నాడు? దొడ్డివైపు గుమ్మం దగ్గరికి పరగడుపుతో నీరసంగా నడిచొచ్చి, బుట్ట కిందపెట్టి, ఆ యింటి మరుగుదొడ్డికి కిందుగా వున్న నలుచదరపు రేకు మూతను తొలగించి ముందుకు వొంగాడు.

అటుచివర మేడ గదిలో తువ్వన్న, ఇటుచివర మరుగుదొడ్డి వెలివాకిట మాతయ్య!

మానవుడు పచ్చిమాంసాన్ని వుడకేసుకు తినటం నేర్చుకున్నప్పటినుంచి ఎన్ని ఉద్యమాలు కాలగర్భంలో కలిసిపోయాయో ఎవరికి తెలుసు? అవన్నీకూడా మాన శరీర నిర్మాణ రీతిలోనే మానవ సమాజ వ్యవస్థ రూపు దిద్దుకోటానికి దోహదం చేశాయితప్ప, మరేం సాధించగలిగాయి? సామాజిక నీతి, సామాజిక న్యాయం, సామాజిక ధర్మం, సామాజిక చట్టం అంటూ ఆ ఉద్యమాలలో నుంచి పుట్టుకొచ్చిన గుడ్డీ చెవిటీ కుంటీ మొండీ బండ నిర్దేశికాలు లొట్టెడు తిండిని తెచ్చి ఆ చివర వున్నవాడి నోటికి అందిస్తున్నాయి; వాడు తిని విసర్జించినదాన్ని తట్టకెత్తుకు పొమ్మని ఈ చివర వున్నవాణ్ణి పురమాయిస్తున్నాయి.

ఈ తాటిని తిరగెయ్యటమో, తాటి నంటిపెట్టుకున్నవాళ్ళ స్థానాలను తారుమారు చెయ్యటమో కాదు కావలసింది. ఈ నిర్మాణం నేలమట్టం కావాలి. ఈ నమూనా మారాలి!

ఈ లక్ష్యాన్ని ఏ ఉద్యమం సాధించగలదు! తాను తిని తేన్చటమే లోకశ్రేయంగా సూత్రీకరించే స్థితిమంతులతో చేతులు కలిపి జనం గొర్రెదాటుగా సాగించే ఉద్యమాలలోనుంచి సమతాంకురాలు మొలకెత్తుతాయనుకోవటం వట్టి భ్రమ! ఇవన్నీ పుచ్చగింజలు!

● ఆంధ్రప్రభ సచిత్ర వార పత్రిక 9-12-1983 ●